


# అనుక్షణం - సృజన్ సేన్

## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
## కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
## సాధారణ బహుమతి పొందిన నవల
## (గతసంచిక తరువాయి)

**ఇప్పుడు ఈ విషయం** ఎందుకు గుర్తొచ్చింది. అంటే మనసు మాత్రం పాత విషయాలను తవ్వి తీస్తోందన్న మాట. అయిదు వేల రూపాయలు అప్పు చెల్లించినప్పుడు చాలా బాధ కలిగింది. అది చాలా కాలం వెంటాడుతూనే వుంది. అంటే ఆ డబ్బు మామ్మ గారి సిద్ధాంతం ప్రకారం తనది. అది ఎంత గట్టిది అంటే ఆ మామ్మ గారే అనేది.

"మనం ఎన్నన్నా చెప్పుకోవచ్చు. ఏదీ మన చేతిలో వుండదు. పైవాడు అన్నీ మన ముఖాన రాస్తాడు. డబ్బు నీది అనుకున్నప్పుడు అదెట్లా నీది అని ఓ అనుభవాన్ని నీ ముందు పెడతాడు. నీకు డబ్బు మీద, మనుషుల మీద, చివరికి స్వంత భార్య, పిల్లలు, కుటుంబం మీద వైరాగ్యం వస్తుంది. అప్పుడు జరిగేవాటిని ఓ పద్ధతిలో పెట్టుకుని ఆలోచిస్తే తెలుస్తుంది. ఇంటి మీద, పిల్లల మీద నీకు ప్రేమ పెరిగే విషయాలు జరుగుతుంటాయి. అవి మంచివి కావచ్చు. చెడ్డవి కావచ్చు".

"మనం అనుకుంటాం. ఈ డబ్బు పోయింది అది వచ్చింది అని. అంతా మాయ అంటాను. రైతులందరూ కష్టపడే పంట పండిస్తారు. ఒక్క గాలి వాన నోటి దగ్గర కొచ్చిన పంటని లాక్కుపోతుంది. సముద్రపు వొడ్డున సరదాకి కూర్చుంటారు. ఓ రాక్షస అల వచ్చి మింగేస్తుంది. ఎప్పుడేం జరుగుతుందో ఎవరికీ తెలియదు. అందుకే మనుషులు లాభం, నష్టం వీటి గురించి ఆలోచించకూడదు. నువ్వు నీ దగ్గర నుండి ఎంత పోయినా, నీ స్వంత మనుషులు కళ్ల ముందు రాలిపోబోతున్నా నువ్వు దుఃఖ పడకు. అది సహజం అనుకో. అలాగే నీకు ఏది కలిసి వచ్చినా అది ఇంతకు ముందు జన్మలో నువ్వు పోగొట్టుకున్నదై వుంటుంది. తిరిగి నీకు అందుతోంది. మిగతా విషయాలు నీకు అనవసరం".

మామ్మ గారు ఇన్ని సంవత్సరాల తర్వాత కలలోకి వచ్చారంటే తనని మేలుకొలపటానికే. అంటే ఇంక ఈ ఏభై లక్షలు తనవి. ఇందులో ఎలాంటి అనుమానాలకు, ఆలోచనలకూ చోటు వుండకూడదు. వీటిని ఎలా ఖర్చు చేయాలి. ఈ విషయం గురించి ఆలోచించాలి. వీటిని సద్వినియోగం చేయాలి. వీటికి పిల్లల్ని పుట్టించాలి. అదీ సమర్థుడి లక్షణం.

ఇలా అనుకున్నాక వెంకటాద్రికి తృప్తి కలిగింది.

★ ★ ★

నాలుగు రోజులు గడిచిపోయాయి.

ఈ మధ్యలో డబ్బు గురించిన ఆలోచన రాలేదు అనటానికి లేదు. అలాంటిది వచ్చినా బలవంతంగా మనసు నుండి బయటకు నెట్టేశాడు. ఈ డబ్బు తనది. అది తేలిపోయింది.

అతనికి తిరుమలలోని వడ్డి కాసుల స్వామి తలపుకి వచ్చాడు. తన పేరు వెంకటాద్రి అని పెట్టుకున్నారు. అమ్మా నాన్నలకు తను ఒక్కగానొక్క కొడుకు. చాలా కాలం పుట్టలేదు. మాకు అబ్బాయిని యిస్తే కొండకు వస్తాం. నిలువు దోపిడి ఇస్తాం. ముందు ఆ అబ్బాయికి వెంకటాద్రి అని పేరు పెట్టుకుంటాం. అమ్మాయి పుడితే వెంకమ్మ అని పెట్టుకుంటాం అని మొక్కుకున్నారంట అమ్మానాన్నలు. తను పుట్టాడు. మళ్లీ పిల్లలు పుట్టలేదు.

పెళ్లి జరిగిన అయిదారేళ్ల కాలంలోనే సంవత్సరం తేడాతో ఇద్దరూ వెళ్లిపోయారు.

అమ్మ ఎప్పుడూ వెంకటాద్రికి చెబుతుండేది.

''నాయనా... నువ్వు ఏ పని చేయాలనుకున్నా ముందు స్వామిని నమ్ము. తిరుమల కొండకు వెళ్లు. తల నీలాలు ఇవ్వు. నీకు కావలసిన కోరికలు మొక్కుకో. నీకు వీలయినప్పుడల్లా స్వామిని దర్శించుకో. నువ్వు ఎంత దూరంలో వున్నా ఇది మరువకు. నువ్వు మా బిడ్డవి కావచ్చు. కానీ నిన్ను మాకు అందించింది స్వామి. మేం కేవలం నిన్ను పెంచి పెద్ద చేశాం. అంటే పెంపుడు తల్లీదండ్రులమే''.

వెంకటాద్రికి తను ఏం చేయాలన్నా ముందుగా తిరుమల వెళ్లి రావాలి. అక్కడ స్వామిని దర్శించాలి. హుండీలో కొంత మొత్తం వేయాలి. ఇప్పటి వరకు తిరుమల అయిదారు సార్లు వెళ్లాడు. అయితే తృప్తిగా స్వామి దర్శనం అయింది అనటానికి లేదు. అసంతృప్తే. ఆ రద్దీ అలాంటిది. ఇవతలకి లాగేస్తారు. ఇప్పుడు అలా కాదు. ఎంత డబ్బు ఖర్చు అయినా స్వామి ఎదురుగా కొన్ని నిముషాలయినా కూర్చోవాలి. తనివితీరా దర్శనం చేసుకోవాలి.

అలా అనుకున్నాక సంతోషం కలిగింది.

ఆ రోజు ఇంటికి రాగానే కళ్యాణి ముఖం వాడిపోయి వుంది. తను చాలా బాధగా వుంది. ఏం జరిగిందా అని కంగారు పడ్డాడు.

''ఏంటి అలా వున్నావు?'' అన్నాడు.

''మీరు ఏమీ అననంటే ఓ విషయం చెబుతాను'' అంది కళ్యాణి.

అంటే అటక మీద సూట్ కేసు బయటకు తీసిందా? అందులోని డబ్బు చూసిందా? అలా జరిగితే ముఖంలో విషాదం ఎందుకు?

''నేను ఏమీ అనను'' అన్నాడు.

అప్పుడు లోపలకి వెళ్లి ఓ కవర్ తీసుకు వచ్చింది.

"ఇదేంటి?" అన్నాడు.

"చూడండి" అంది.

అప్పుడు కవర్ ని తెరిచి చూసాడు. వెయ్యి రూపాయల నోట్లు! లెక్క పెట్టాడు. మొత్తం ఏభై వున్నాయి. అంటే ఏభై వేలు!

"ఇవేంటి?"

"చీరల మడతల్లో దొరికాయి. మీరు ఆఫీస్ కి వెళ్లిన దగ్గర నుంచి తలలు బద్దలు కొట్టుకుంటున్నాను. ఎక్కడివో అర్థం కావటం లేదు. నాకు గుర్తు రావటం లేదు. ఇంతకు ముందు నేను డబ్బులు దాచాను. అందులో వెయ్యి రూపాయల నోట్లు వున్నాయి. అవన్నీ అప్పట్లో మార్చుకున్నాం కదా!"

వెంకటాద్రికి పెద్ద నోట్లు రద్దు విషయం గుర్తొచ్చింది. దేశం దేశం విలవిలలాడిపోయిన రోజులు. అందరూ బేంకుల ముందు బారులుగా, చీమల్లా నిలబడి ఆ నోట్లు మార్చుకోవటానికి తంటాలుపడిన రోజులు. కొంత మంది ప్రాణాలు పోగొట్టుకున్న రోజులు. జాతి మొత్తం వణికింది. అందులో కోట్లాది రూపాయలు వున్నవారే కాదు. మధ్య తరగతి వారు వున్నారు.

వెంకటాద్రి దగ్గర అంత డబ్బు లేదు. వాళ్లు ఎప్పుడూ ఇంట్లో అంత డబ్బు వుంచే వారు కాదు. బేంకుల్లో వేసేవారు. కొన్ని నోట్లున్నా అవి మార్చుకున్నారు సులభంగానే.

అప్పుడు కొంత మంది నుండి ఆఫర్లు వచ్చాయి. మా దగ్గర పది లక్షల రూపాయలు రద్దయిన నోట్లు వున్నాయి. మీరు టాక్స్ ప్రేయర్ కదా. ట్వంటీ పర్సెంట్ ఇస్తాం అన్నారు. ఇంకో అయిదు, పది శాతం పెంచిన వారు కూడా వున్నారు. కొంత మంది దగ్గరున్న నోట్లు వాసన కూడా వచ్చాయనుకున్నారు.

వెంకటాద్రి అప్పుడు కాస్త టెంప్ట్ అయ్యాడు. అయినా ఇలాంటి తల నొప్పులు నాకు అనవసరం అనుకున్నాడు. అలా కొంత మంది సంపాదించుకున్న వారున్నారు.

"ఈ కవర్లోనే డబ్బు వుందా?"

"లేదు. నేను కవర్లో పెట్టాను. మీరు ఏమన్నా దాచారా?"

"నేను దాయటం ఏంటి? అలాంటి అలవాటు నాకుందా? నేను జీతం డబ్బులు తీసుకుని నీకే యిస్తాను. ఇంటి నిర్వహణ నువ్వు చూసుకుంటావు. ఆ దాపరికాలేవో నీకే తెలియాలి" అన్నాడు వెంకటాద్రి.

"ఎప్పుడు ఎలాంటి అవసరం వస్తుందో తెలియదు. అందుకని మన డబ్బులు కాదని పక్కన వుంచుకోవాలని పెద్దలు చెబుతుంటారు. అందుకని దాస్తాను. అయినా అవన్నీ నేను తింటానా? అమ్మాయి పెళ్లి కని ముందు నుండి బంగారం కొంటున్నాను. అప్పటికప్పుడు కొనాలి కదా. ధరలు పెరుగుతాయి".

"ఇప్పుడు నేను ఏమన్నాను. మీరు దాచారా అని అడిగావు. ఇదేదో నువ్వు చేసిందే. ఎవరన్నా నీ దగ్గర దాచారా? నువ్వు బాగా గుర్తు చేసుకో. అయినా ఓ వెయ్యో–రెండు వేలో కాదు. ఏకంగా ఏభై వేల రూపాయలు. ఎవరు తిన్నట్లు. నాలిక గీసుకోవటానికి కూడా పనికి రావు ఆ నోట్లు".

"ఇప్పుడు ఇవి ఇంట్లో వున్నా ప్రమాదం. వీటిని ఏం చేద్దాం?"

"తగలబెట్టు. అంతకంటే ఏం చేస్తాం?"

"నా దగ్గర డబ్బులు ఎవరు దాచుకుంటారు. వారికి మాత్రం తెలియదా పెద్ద నోట్లు రద్దయ్యాయని. అప్పుడు అడగరా. అయినా చూస్తూ చూస్తూ ఇంత డబ్బుని తగలేయాలంటే నాకు మనసు రావటం లేదు. ఆ పనేదో మీరే చేయండి" అంది కళ్యాణి.

"అవలావుంచు. ఏం చేయాలో తర్వాత ఆలోచిద్దాం" అన్నాడు వెంకటాద్రి.

ప్రభుత్వం ఏ కారణంతో రద్దు చేసినా, వందకు వంద శాతం పాత నోట్లు తిరిగి రాలేదు. ఎనభై శాతం వరకు వచ్చాయని ఎక్కడో చదివిన గుర్తు. ఇంకో ఇరవై శాతంలో కొంత మంది ఇలా తగలబెట్టి వుండవచ్చు. అయినా రద్దయిన పెద్ద నోట్లు ఇంకా దేశంలో వున్నాయి. ప్రభుత్వం ఎప్పుడూ ఒకటే వుండదు. మారుతుంటాయి.

అలాగే ప్రభుత్వం 'మూడ్' కూడా ఎప్పుడూ ఒకేలా వుండదు. మారుతుంటుంది. పాత నోట్లను మార్చుకోవటానికి మరో అవకాశం ఇవ్వవచ్చు. అలా జరగకూడదని లేదు.

ఈ ప్రపంచంలో ఏదయినా జరగవచ్చు!

అలా కాకున్నా వీటిని దాయటం వలన భవిష్యత్తులో తమ మనవలు వాటిని అమ్ముకోవచ్చు. పాతనోట్లు, స్టాంపులు, ఇతర యాంటిక్స్ సేకరణ ప్రపంచ వ్యాప్తంగా వుంది.

ఇలా అనుకున్నప్పుడు కాస్త తృప్తి కలిగింది. అయితే ఏభై లక్షలు వెంకటాద్రి జీవితంలోకి రాకపోతే మాత్రం అప్పుడు అయిదు వేలు, ఇప్పుడు ఏభైవేలు అని బాధ పడుతూనే వుండేవాడు.

మామ్మ గారి మాటల్లో 'ఇది మన డబ్బు అయితే!' అదే నిజమా?

★ ★ ★

శివకృష్ణ ఊరి నుండి రావటం జరిగింది.

వెంకటాద్రి, శివ ఇద్దరూ ఎప్పటిలా నడుస్తున్నారు.

"శివా నువ్వు మళ్లీ ఫోన్ చేయలేదు"

"అవును. నా ఫోన్ పోయింది. దాంతో పాటు రెండు వేల రూపాయలు"

"అదేంటి!"

''అలా అంటే ఏం చెప్పను. అదయితే వాస్తవం. ఫోన్ లేక యిబ్బంది పడ్డాను. అయినా ఎలా పోయిందో తెలియదు. అది దొరికినవాడో, దొంగతనం చేసిన వాడో మళ్లీ ఫోన్ చేస్తాడేమో నన్న ఆశ మాత్రం వుండేది. ఇప్పుడది లేదు''.

''కొత్త ఫోన్ తీసుకున్నావా?''

''తప్పదుకదా! గాలి లేకుండా అనను గాని తిండి లేకుండా బతకవచ్చు కొన్ని రోజులు. ఫోన్ లేకుండా బతక గలమా నాలుగు రోజులు''.

''ఎందుకు బతకలేం. ఒకప్పుడు సెల్ ఫోన్లు లేవు. బతికాం. ఇంటర్ నెట్లు, స్మార్ట్ ఫోన్లూ తర్వాత వచ్చాయి. మనం వాటి మాయలో పడ్డాం. ఇప్పుడయినా తలుచుకుంటే అవి లేకుండా మనిషి బతకగలడు'' అన్నాడు వెంకటాద్రి.

అప్పుడు శివ నవ్వాడు. ''తలుచుకుంటే అంటున్నావు. అదే కష్టం. మనిషి బంధనాల్లో వున్నాడు. నీకు ఇద్దరి పిల్లల బాధ్యత వుంది. నాకూ వుంది. ఇదేం వాన ప్రస్థం కాదు. మనుషుల్లో వున్న సహజత్వాలన్నీ ఒక్కొక్కటీ మాయం అవుతున్నాయి. నీ దగ్గరకు రూపాయి వస్తుంటే నువ్వు మాయలోకి ఎంటర్ అయినట్లు. అప్పటి నుంచి నువ్వు నువ్వు కాదు. అది ఆడవారికీ వర్తిస్తుంది. కొత్త కోరికలు పుడతాయి. కొత్త గమ్యాలు వస్తాయి. మనకి వస్తువులు కనిపిస్తాయి. నిజానికి అది డబ్బు. అందుకని మనిషి బతకగలడు అనకు. అసలు బతుకంటే ఏంటో మనకు తెలిస్తే తర్వాత మాయల గురించి మాట్లాడవచ్చు''.

వెంకటాద్రికి పాత నోట్ల గురించి చెప్పాలనిపించింది. ఏభై లక్షల గురించి చెప్పాలన్న ఆవేశం వచ్చింది. చివరి నిముషంలో తనను తాను నిగ్రహించుకున్నాడు.

''ఇంతకు ముందు నువ్వు ఎప్పుడన్నా డబ్బులు పోగొట్టుకున్నావా?''

అప్పుడు వెంకటాద్రిని చూశాడు.

''పొరపాటునా, కావాలనా?''

''అలా కూడా వుంటుందా?''

''తెలియక అడుగుతున్నావా?''

వెంకటాద్రి మాట్లాడలేదు.

అప్పుడు అతన్ని రాళ్ల గుట్టల దగ్గరికి తీసుకుపోయాడు.

''నాకెందుకో ఇవి శివలింగాల్లా అనిపిస్తాయి''.

''అవునా. నాకు శాపగ్రస్తులయిన దేవకన్యల్లా అనిపిస్తాయి'' అన్నాడు శివ. ఆశ్చర్యంగా చూసాడు వెంకటాద్రి.

''మన మునులు ఎంత తప్పు చేస్తారంటే, ఘోర తపస్సు చేసి, వరాలు పొందినా ఆగ్రహాన్ని, అహాన్ని జయించలేరు. అందమైన ఆడపిల్లల్ని శిలలు కమ్మని శపిస్తారు. ఇందుకా తపస్సులు. అప్పుడయినా ఇప్పుడైనా ఇది మోహ ప్రపంచం కదా. స్త్రీ–పురుషులు రస స్ఫూర్తిని పొందాలి. అందుకు తపస్సులు చేయాలి. అందుకేగా వస్తువుల సృష్టి. ఆడంబరాల

సృష్టి. కొత్త లోకాల సృష్టి. ఇలాంటివేం అనుభవించకుండా ముక్తో ముక్తి అనేవారు అల్ప జీవులు'' అని ఓ రాయి మీద కూర్చున్నాడు.

''సంభాషణ పక్క దారి పట్టింది''.

''అదేం లేదు. అన్నీ గుర్తున్నాయి. కావాలని డబ్బు పోగొట్టుకునే మిత్రులు నాకు తెలుసు. దగ్గరగా పరిచయం వుంది. కొంత మంది గురించి విన్నాను. కొందరు ఆడవని తెలిసినా సినిమాలు తీస్తారు. అక్కడ తన నటన ముఖ్యం. ప్రపంచానికి తనదయిన నమూనాను ఇవ్వాలనుకుంటారు. రేసులు ఆడేవారిని చూశాను. సాయంకాలం అవగానే మనం నడకకు వచ్చినట్లు పేకాట క్లబ్బులకి వెళ్లే వారున్నారు నా మిత్రుల్లో. వాళ్లకి కావల్సింది డబ్బు కాదు. కొందరికి కాలక్షేపం. ఇంకొందరికి గెలుపు. గెలవటంలోని కసి, ఎవరి గోలవారిది''.

''నేను మామూలు మనిషిని శివా. సంసార సాగరంలో ఈదుతున్నాను. నీ మాటలు నాకు అద్భుతంగా వుంటాయి. కొన్ని లౌకిక విషయాలు. మరికొన్ని అలౌకిక విషయాలు''.

''ఇంతకు ముందు డబ్బులు పోగొట్టుకున్నావా అని అడిగావు. అలాంటివి పెద్దగా గుర్తు పెట్టుకోను. నేను స్త్రీని కోల్పోయాను. అంటే నేను ప్రేమించిన స్త్రీని. ఆ స్త్రీ ఒక్కరు కాదు. డబ్బులు రావని సినిమా తీసినట్లు, ప్రేమించదని తెలిసీ స్త్రీని ఆరాధించటంలోనూ ఓ మహత్తరమైన విషయం లేదూ...!''

''నేను ప్రేమ విషయంలోనూ వెనకబడి వున్నాను. ఏ అమ్మాయినీ ప్రేమించక ముందే నా పెళ్లి అయిపోయింది'' అన్నాడు వెంకటాద్రి.

''చెప్పానుకదా. ఎవరి శైలి వారిది. ఎవరి అనుభూతి వారిది. డబ్బులదేముంది కొన్ని విషయాల్లో పోతుంటాయి. వస్తుంటాయి. పోయిన డబ్బుని సంపాదించుకోవచ్చు. కానీ మన జీవితం నుండి మరలిపోయిన ప్రేమను తిరిగి పొందటం కష్టం. అథవా సాధించినా అప్పటికి సమయం మించిపోతుంది. జీవితమే చిన్నదయినప్పుడు యవ్వనం మరింత చిన్నది కావటంలో ఆశ్చర్యం ఏముంది!''

''నీ రొమాంటిక్ జీవితం గురించి వినాలని వుంది. ఇప్పటికిప్పుడు చెప్పమని కాదు. మనకు తీరిక దొరికినప్పుడు''.

''తీరిక ఎప్పుడూ దొరకదు. మనం తీరిక చేసుకోవాలి వెంకటాద్రీ'' అన్నాడు శివ.

★ ★ ★

వెంకటాద్రి ఆఫీస్ కి వెళ్లాడు.

అప్పటికే వాళ్ల బాస్ వచ్చి వున్నాడు. అతన్ని లోపలకు పిలిచాడు. ''మన ఎకౌంట్స్ అన్నీ సరిగ్గా వున్నాయి కదా'' అన్నాడు.

''అన్నీ అప్ డేట్ గా వున్నాయి నిరంజన్ గారూ''.

"ఏం లేదు. ఈ మధ్య సిటీలో ఇన్ కమ్ టాక్స్ రెయిడ్స్ జరుగుతున్నాయి. మన మీద దృష్టి లేదు. అయినా ఎప్పుడేం జరుగుతుందో చెప్పలేం కదా".

"అవును. మన జాగ్రత్తలన్నాక మనం తీసుకుంటాం".

"వ్యాపారం అన్నాక చిన్నవో, పెద్దవో సమస్యలు వుంటాయి. ఓ సారి రెయిడ్ జరిగి డాక్యుమెంట్లు ఏవన్నా దొరికినా, అసలేం దొరక్కపోయినా వారి ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వుంటుంది" అన్నాడు నిరంజన్.

వెంకటాద్రి తలూపాడు.

"నేను వారం రోజుల తర్వాత బెంగళూరు వెళ్తాను. అక్కడో రియల్ ఎస్టేట్ వెంచర్ వుంది అంటున్నారు. అది స్టడీ చేయాల్సి వుంటుంది. అవసరం అనుకుంటే మనం కలిసి వెళ్దాం".

"నాకు రియల్ ఎస్టేట్ మీద అంత పట్టు లేదు నిరంజన్ గారూ... "

"మనుషులు పుట్టుకతోనే అన్నీ నేర్చుకుంటారా? ఎకౌంట్సయినా అంతే కదా. మనం ఉన్నదాంతో సంతృప్తి పడితే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వున్నట్లుంటాం. నాకు ఈ సారి మన అనుకున్న వాళ్లకు భాగస్వామ్యం ఇవ్వాలనుంది".

"చాలా పెద్ద వెంచరా సర్".

"అంతది కాదు".

"ఏ మాత్రం పెట్టుబడి అవసరం అవుతుంది. మొత్తం వెంచర్ కి కాదు. ఉదాహరణకి అవకాశం వుంటే నేను ఎంత వరకు పెట్టుబడి పెట్టవచ్చు?" అన్నాడు వెంకటాద్రి.

"అది మీ దగ్గరున్న ఫండ్స్ బట్టి వుంటుంది. కనీసం ఇరవై అయిదు నుండి ఏభై లక్షలు ఇన్ వెస్ట్ చేయవచ్చు".

"నా దగ్గరున్న ఫండ్స్ చాలా తక్కువ. అయినా నేను ముందు ఓ ఇల్లు తీసుకోవాలనుకుంటున్నాను. రిటైర్ మెంట్ బెనిఫిట్స్, నేను దాచుకున్నవీ ఇరవై అయిదు దాకా వచ్చాయి. ఓ పక్కన పిల్లలు చదువుకుంటున్నారు. వారికి ఎప్పుడు ఎలాంటి అవసరం వస్తుందో తెలియదు".

"మీరు ఎకౌంట్స్ ఆఫీసర్ గా రిటైర్ అయ్యారు. మీకు అన్ని విషయాలు తెలుసు. ఇప్పుడు పిల్లల చదువులు సమస్య కాదు. ఎడ్యుకేషన్ లోన్స్ బ్యాంక్ లు ఇస్తున్నాయి. రేపు ఉద్యోగాలు చేసి వాళ్లే కట్టుకుంటారు. మేధావులు ఇండియన్ రూపీని నమ్ముకోవటం లేదు. అన్నీ డాలర్ డ్రీమ్స్" అన్నాడు నిరంజన్.

వెంకటాద్రి చిన్నగా నవ్వాడు.

"ఏమీ చదువుకోని వారు లక్షలూ, కోట్లూ సంపాదిస్తున్నారు. అందులో రియలెస్టేట్ ఒకటి. ఇంతకు ముందు నేను సీరియస్ గా తీసుకోలేదు. సరే ఆలోచించండి" అన్నాడు.

వెంకటాద్రి సీట్ దగ్గరకు వచ్చాడు.

నిరంజన్ ఆఫర్ గురించి ఆలోచిస్తున్నాడు.

ఇంతవరకు తనకు నిజంగా ప్లాన్ లేదు. నాలుగెకరాల భూమి వుంది కదా అనుకున్నాడు. అంతకు మించి ఇంటి స్థలం కూడా కొనలేదు. కళ్యాణి బంగారం కొనటం పట్ల ఉత్సాహం చూపించింది.

ఆ మధ్య మొత్తం బంగారం తమ దగ్గర ఎంత వుందని లెక్కచూసుకున్నారు. కిలో కంటే పైన వుంది. అప్పుడు బంగారం ఒక్క స్త్రీకి ఇన్ని గ్రాముల మించి వుండకూడదు అన్నప్పుడు పెద్ద సంచలనం కలిగింది. పాత బంగారానికి కూడా లెక్కలు చెప్పాలన్నారు. లేకపోతే అవన్నీ జప్తు చేసుకుంటారంట.

అసలు ఈ ప్రభుత్వాలు ఏమిటో ఈ పరిపాలన ఏమిటో మామూలు మనుషులకు అర్థం కావటం లేదు. ఓ పక్కన లక్షల కోట్ల ఆస్తులతో దేశంలోనూ, ప్రపంచంలోనూ కుబేరులయ్యారని పత్రికల్లో, టీ.వీల్లో వార్తలు వస్తుంటాయి. మెడలో గొలుసూ, నాలుగు గాజులూ వుండటం కూడా నేరం. మామూలు మనుషులకి, వ్యాపారస్థులకి మధ్య ఇంత అంతరమా!

మొదటిసారి బంగారం అంటే ప్రేమ చచ్చిపోయింది. అంతకుమించి భయం కలిగింది. మామ్మగారు చెప్పిన స్టూవర్ట్ పురం దొంగల కథ వేరు. సాధారణంగా వాళ్లు దౌర్జన్యం చేయరు. వారికి ప్రమాదం అనుకున్నప్పుడు తప్పితే. ఇదిగో ఈ ప్రభుత్వాలు అంతే.

ఎందుకు ఉచితాలు ఇస్తారో తెలియదు. టైగర్ నాగేశ్వరరావు గురించి కథలు వెంకటాద్రి విన్నాడు. అలాంటి వారు గద్దలను కొట్టి కాకులకు వేస్తారని చెప్పుకునేవారు. ఇక్కడ రివర్స్. కాకుల్ని కొట్టడమే. అందులోనూ మధ్య తరగతి కాకుల్ని! ఉచితాల విలువ ఎంత! కార్పొరేట్. గద్దలకు పెట్టేది ఎంత? ఇవి లెక్కలకి అందనంత. జనానికి చెప్పేది కాకి లెక్కలు.

అసలు మనుషులు మారిపోయారు. బేవార్సుగా వచ్చేవాటికి అలవాటు పడిపోయారు. ఓట్లు అమ్ముకుంటారు. మందు తాగుతారు. పనులు చేయటానికి బద్ధకాలు పెరిగిపోయాయి. ఇప్పుడు మనం ఎలా బతుకుతున్నాం అన్నది సమస్య కాదు. అంతగా బతకలేకపోతే పురుగు మందులున్నాయి. ఈ రోజు ఛస్తే రేపటికి రెండు.

ఏ విలువలు లేకపోవటం నేటి విలువ.

ఇన్ని రోజులుగా డబ్బుల గురించి అనవసరంగా ఆలోచించాను అనుకున్నాడు. ఇలాంటి డైలమ్మా మధ్య తరగతిది. వేలాది కోట్లు సంపాదిస్తున్న రాజకీయ నాయకులకు లేని నైతిక విలువలు మాకు మాత్రం ఎందుకు? ఆ ఏభై లక్షలు నా స్వంతం. నా అదృష్టం. నా కోసం భగవంతుడు పంపాడు. వాటిని సద్వినియోగం చేయాలి. దానికి చెంది రెండో ఆలోచనకి చోటు లేదు. అలా అనుకున్నప్పుడు కాస్త తృప్తి కలిగింది.

మళ్లీ నిరంజన్ గుర్తొచ్చాడు.

ఇరవై వేల జీతం ఇవ్వటం చిన్న విషయం కాదు. ఈ రోజుల్లో ఆ జీతంతో ఇద్దరు ఉద్యోగులు వస్తారు. అతనికి తన మీద అభిమానం వుంది. అందుకే ఇలాంటి ఆఫర్ యిచ్చాడు.

కాకపోతే జాగ్రత్తగా అడుగులు వేయాలి. తనకు రిటైర్ మెంట్ బెనిఫిట్స్ వున్నాయి. అవన్నీ 'వైట్' ఎమౌంట్స్. ఇన్ని సంవత్సరాలుగా పొలం మీద ఆదాయం వస్తున్నట్లు చూపించవచ్చు. మంచి ఆడిటర్లు వున్నంత వరకు యిబ్బంది లేదు.

బెంగళూరులో భూములకు మంచి ధర వుంది. అందుకని ముందు ఓ పాతిక లక్షల వరకు పెట్టుబడి పెట్టాలి. మెల్లగా మరో పాతిక లక్షలు. ఈ విషయం కళ్యాణితోనూ మాట్లాడతాను అనుకున్నాడు. దానికి ముందు శివతో మాట్లాడాలి. అతను మంచివాడు. మంచి సలహాలు ఇవ్వగలడు. కాకపోతే రొమాన్స్ అంటాడు. మోహం, ప్రేమ అంటాడు. అవన్నీ అనటానికి సరదాగా వుంటాయి. అదో కాలక్షేపం. నా నడమంత్రపు సిరి గురించి చెప్పకూడదు. అది అనవసరం అనుకున్నాడు.

★ ★ ★

శివ, వెంకటాద్రి నడుస్తున్నారు. చీకట్లు మెల్లగా కమ్ముకుంటున్నాయి. చల్లటి గాలి వీస్తోంది. వాకింగ్ మొదలయిన వెంటనే ఓ అరగంట వేగంగా నడుస్తారు. తర్వాత అది తగ్గుతుంది. అక్కడ నుండి రకరకాల కబుర్లు. అతను సినిమాలు బాగా చూస్తాడు. వెంకటాద్రిని రమ్మంటాడు. తనకు మూడ్ వున్నప్పుడు వెళ్తుంటాడు. ఇంగ్లీష్ సినిమాలకు కూడా తీసుకువెళ్తాడు. కొన్ని సినిమాలు అర్థం కాక రానని చెప్పాడు. తెలుగు సినిమాలు చూస్తుంటారు.

నిరంజన్ ప్రపోజల్ గురించి చెప్పాడు. అతను శ్రద్ధగా విన్నాడు.

"నాకు ఇల్లు కొనాలనుంది. అది బెటరా... రియలెస్టేట్ లో పెట్టుబడి పెట్టటం మంచిదా?" అన్నాడు వెంకటాద్రి.

"నువ్వు ఎకౌంట్స్ చూస్తావు. అయినా నన్ను సలహా అడుగుతున్నావు. మామూలు మనుషులు రిటైర్ అయ్యేనాటికి ఓ ఇల్లు వుంటే అందులో ప్రశాంతంగా వుండవచ్చు. అందులోనూ ఇంకో పోర్షన్ వుంటే అద్దె వస్తుందనుకుంటారు. వ్యాపారం చేయాలనుకున్న వారు ఇంటి మీద అంత పెట్టుబడి పెట్టరు. అవునా?"

"అవును. మూర్ఖులు ఇళ్లు కడితే మేధావులు అందులో అద్దెకి వుంటారు అంటారు కదా!"

శివ చిన్నగా నవ్వాడు.

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

COMMENTS